పంచాయతీ ఓటర్లు 3.88 లక్షలు



- సిద్ధమైన తుది ఓటరు జాబితా
- మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికలకు తుది జాబితాను శనివారం ప్రకటించారు. జిల్లాలోని 255 పంచాయతీల్లోని 2390 వార్డుల వారీగా ఓటరు జాబితాను రూపొందించి ఆయా పంచాయతీల్లోని నోటీసు బోర్డులో ప్రదర్శించారు. దీంతో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ప్రధాన అంకం ముగిసినట్లయింది.

మహిళలదే పైచేయి

ఓటరు జాబితాకు రూపకల్పనలో పంచాయతీ అధికారులు, బీఎల్వోలు, ఎంపీడీవోలు ముఖ్య భూమిక పోషించారు. గత లోకసభ ఎన్నికల ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని వార్డుల వారీగా జాబితాను రూపొందించారు. గత రెండు నెలలుగా కొనసాగిన ఈ ప్రక్రియ అనంతరం ఈ నెల 6వ తేదీన ముసాయిదా జాబితాను ప్రకటించారు. 9వ తేదీన జిల్లా స్థాయిలో, 10వ తేదీన మండల స్థాయిలో వివిధ రాజకీయ పక్షాలతో ఓటరు జాబితాపై సమావేశాలు నిర్వహించారు. 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించారు. వచ్చిన అభ్యంతరాలను 21 వరకు పరిశీలించిన అనంతరం శనివారం తుది జాబితాను ప్రకటించారు. ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలోని 2,390 వార్డుల వారీగా 3,88,195 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 1,91,291, కాగా మహిళలు 1,96,904 మందితో పాటు, ఇతరులు ఏడుగురు ఉన్నారు. జిల్లాలో పురుషుల కన్నా 5,613 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

మొదటి విడత: గద్వాల, ధరూర్, కేటీదొడ్డి, గట్టు
రెండో: మల్దకల్, అయిజ, వడ్డేపల్లి, రాజోలి
మూడో: అలంపూర్, ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పంచాయతీలు	పురుషులు	మహిళలు	ఇతరులు
అలంపూర్	14	8,604	8761	-
ధరూర్	28	18,890	19,734	-
గద్వాల	28	17,116	17,685	-
గట్టు	27	23,109	24,024	01
అయిజ	28	22,532	22,924	04
ఇటిక్యాల	29	20,692	20,963	01
కేటీ దొడ్డి	23	13,972	14,118	-
మల్దకల్	25	20,842	21,640	-
మానవపాడు	16	11,920	12,459	-
రాజోలి	11	13,692	13,850	-
ఉండవల్లి	16	11,654	12,084	01
వడ్డేపల్లి	10	8,268	8,350	-

రిజర్వేషన్లే అసలు తంతు

2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్‌ను పది సంవత్సరాలు కొనసాగించాలని గత ప్రభుత్వం చట్టం చేసింది. దీని ప్రకారం ఈ దఫా పంచాయతీ ఎన్నికల్లో కూడా గత రిజర్వేషన్‌లనే తీసుకోవాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో అధికార పార్టీ మారిన నేపథ్యంలో రిజర్వేషన్ల అంశం ప్రధానంగా చర్చకు వస్తోంది. బీసీకు రిజర్వేషన్లు పెంచాలనే అంశం తెరపైకి రావడంతో ప్రభుత్వం ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను పూర్తి చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన వంతు బాధ్యతగా వార్డులు, పంచాయతీల రిజర్వేషన్‌ల అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

'సత్యశోధన' గోడపత్రిక ఆవిష్కరణ

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ ఆధ్వర్యంలో 'బాపూ బాటలో.. సత్య శోధన' పాదయాత్ర గోడపత్రికను శనివారం తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సంతోష్ ఆవిష్కరించారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న గద్వాల కలెక్టర్ సంతోష్

విశ్రాంత జిల్లా విద్యాధికారి విజయ్‌కుమార్, పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎన్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర అక్టోబరు 2న అలంపూర్‌లోని జోగులాంబ దేవాలయం నుంచి ప్రారంభమై వచ్చే ఏడాది జనవరి 12న అచ్చంపేటలోని ఉమామహేశ్వర దేవాలయం వద్ద ముగించనున్నారు. 100 రోజుల్లో 1000 కిలోమీటర్లు కొనసాగే ఈ యాత్రలో చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని, మద్యం, మత్తు మందు వాడకాన్ని నివారించాలని, స్వదేశీ వైద్యం ఆదరించాలని, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని, యోగా, అందరికీ పౌష్టికాహారం, సంపూర్ణ ఆరోగ్యం లాంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. నాగరాజు, వెంకటేశ్, టీసీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 7,018 కేసుల పరిష్కారం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: రాజీ మార్గం ద్వారా కక్షిదారుల కేసులను పరిష్కరించేందుకు వేదికలైన లోక్ అదాలత్‌ను పండగలా భావించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.కుష పేర్కొన్నారు. గద్వాల కోర్టు ఆవరణలో శనివారం సుప్రీంకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 7,018 కేసులను పరిష్కరించామని తెలిపారు. వాటిలో క్రిమినల్ కేసులు 6,962, సివిల్ కేసులు 23, సైబర్ క్రైం కేసులు 29, బ్యాంకు ప్రీలిటిగేషన్ 2, విద్యుత్తు ప్రీలిటిగేషన్ కేసులు 2 ఉన్నాయని చెప్పారు. రూ.84,51,019 జరిమానా ద్వారా వసూలు చేశామని వివరించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంటా కవితాదేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ఉదయ్‌నాయక్, గద్వాల ఇన్‌ఛార్జి సీఐ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీపీలు రేచల్ సంజనా జాషువా, భవాని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.కుష, చిత్రంలో న్యాయమూర్తులు గంటా కవితాదేవి, పూజిత, ఉదయ్‌నాయక్

విద్యార్థులు, యువతే ప్రచార తారలు

యువ క్లబ్‌ల ద్వారా పాలమూరు పర్యాటకంపై దృష్టి ● ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 1,397 ఏర్పాటు

మహబూబ్‌నగర్ సమీపంలో పిల్లలమర్రికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మహా వృక్షం ఊడలు ఎక్కడ మొదలయ్యాయో ఎవరూ కనుక్కోలేకపోయారు. దేశంలోనే ప్రసిద్ధి పొందిన పిల్లలమర్రి గురించి నేటి తరానికి తెలిసింది తక్కువే. ప్రధానంగా విద్యార్థులు, యువతకు పిల్లలమర్రి ప్రాముఖ్యత తెలియదు. మన ప్రాంతంలోనే ఉన్న దీని ప్రాముఖ్యతను తెలుసుకుని భవిష్యత్తు తరాలకు తీసుకెళ్లే బాధ్యతను జిల్లాలోని విద్యార్థులు, యువకులు తీసుకోనున్నారు.



ఈనాడు, మహబూబ్‌నగర్: రాష్ట్ర పర్యాటకశాఖ సమన్వయంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న యువ టూరిజం క్లబ్‌లు(వైటీసీ) స్థానిక విద్యార్థులు, యువతను కొత్త ఆలోచనల వైపు నడిపించనున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,397 వైటీసీలను ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 34,925 మంది విద్యార్థులు, యువకులు భాగస్వామ్యం కానున్నారు. కేవలం మహబూబ్‌నగర్ జిల్లాలోనే 1,317 క్లబ్‌లు ఏర్పాటు చేశారు. మిగతా నాలుగు జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న క్లబ్‌లను పెంచడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు.

బాధ్యత వీరిదే..: నంద వంశం నుంచి అసఫ్ జాహీ వంశం వరకు 22 ప్రముఖ రాజవంశాలు ఈ ప్రాంతాన్ని పాలించాయి. హరిహర, శక్తి కేంద్రాలకు పాలమూరు ఎంతో ప్రసిద్ధి. ముస్లింలు పవిత్రంగా భావించుకునే దర్గాలకు కొదవలేదు. కృష్ణా, తుంగభద్ర నదులు ఇక్కడి నుంచే ప్రవహిస్తాయి. నల్లమల ప్రకృతి సౌందర్యం ఇట్టే కట్టిపడేస్తాయి. వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, ఆత్మకూరు, గోపాలపేట సంస్థానాలకు గుర్తింపు ఉంది. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 34 ప్రాంతాలను వారసత్వ, చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటకశాఖ గుర్తించింది. ఈ సంపదను కాపాడటం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఈ యువ టూరిజం క్లబ్‌లు పని చేయనున్నాయి.

ఒక్కో క్లబ్‌లో 25 మంది..: ఈ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా స్థానిక విద్యార్థులు, యువతకు పర్యాటక ప్రాముఖ్యతపై పూర్తిస్థాయి అవగాహన కల్పించనున్నారు. మొదటి దశలో క్లబ్‌ల ఏర్పాటు, రెండో దశలో పర్యాటకంపై వివిధ దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. మూడో దశలో ఈ క్లబ్‌లు క్షేత్రస్థాయికి వెళ్లి సంస్కృతి, సంప్రదాయాలకు పర్యాటక రంగాలు ఎలా ఉపయోగపడతాయి? వీటి పరిరక్షణ ఎలా చేయాలి? వంటి వాటిపై దృష్టి పెడతారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో ఒక్కో క్లబ్‌ను 25 మందితో ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి క్లబ్‌కు అందులోని విద్యార్థియే నాయకుడిగా, ఆ విద్యాలయంలో పని చేసే ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. దీనిపై మహబూబ్‌నగర్ పర్యాటకశాఖ అధికారి వెంకటేశ్వర్లు 'ఈనాడు'తో మాట్లాడుతూ ఈ క్లబ్‌ల ఏర్పాటుతో పాలమూరు పర్యాటకానికి మరింత గుర్తింపు రావడంతోపాటు విద్యార్థులు, యువతకు వారసత్వ సంపదపై అవగాహన కలుగుతుందన్నారు.

జిల్లా	టూరిజం క్లబ్‌లు	విద్యార్థులు, యువత
మహబూబ్‌నగర్	1,317	32,925
నాగర్‌కర్నూల్	37	925
జోగులాంబ గద్వాల	12	300
నారాయణపేట	19	475
వనపర్తి	12	300

నల్లమల అంటే అడవులే కాదు. కృష్ణా నది అందాలు.. అభయారణ్యం.. పులులు, ఇతర జంతువులు.. ఆధ్యాత్మిక కేంద్రాలు.. ప్రకృతి రమణీయత.. ఇలా సమ్మేళనంగా ఉన్న నల్లమల గురించి పూర్తి స్థాయి అవగాహన నేటి తరానికి అవసరం. ఇక్కడి పర్యాటక విశేషాలను ఇతరులకు అందించాలి. అలా జరగాలంటే ఆ బాధ్యత స్థానిక విద్యార్థులు, యువతపైనే ఉంది.



ఔషధాల కొరత.. రోగులకు వెత

ప్రభుత్వం నుంచి ఆసుపత్రులకు నిలిచిన సరఫరా

న్యూస్‌టుడే, పాలమూరు : మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఔషధాల కొరత తీవ్రమైంది. ప్రభుత్వం సకాలంలో సరఫరా చేయకపోవడంతో ఆసుపత్రి వర్గాలు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఓపీ సేవల కోసం నిత్యం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 2వేలకు పైగా రోగులు వస్తున్నారు. 650 పడకలున్న ఈ ఆసుపత్రిలోని వార్డులన్నీ రోగులతో కిక్కిరిసిపోయాయి. అవసరం మేరకు ఔషధాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

మూడు రోజులకే మందులు.. : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు పరీక్ష చేసిన తర్వాత ఐదు రోజులకు సరిపడా మందులు ఇచ్చేవారు. ఇప్పుడు మూడు రోజుల మందులతోనే సరిపెడుతున్నారు. జనరల్ ఆసుపత్రికి ప్రభుత్వం నుంచి ప్రధానమైన ఔషధాలు కూడా సరఫరా కావడం లేదు. మధుమేహం, వాంతులు, గ్యాస్, మూర్ఛ, మత్తుమందులు, పలు రకాల స్టెరాయిడ్స్, విషం విరుగుడు, నొప్పి నివారణ మందులు, కాల్షియం, మల్టీ విటమిన్ మాత్రలు, గర్భిణులకు అవసరమైన ఔషధాలు, డ్రెస్సింగ్ వాడాల్సిన వస్తువులు, యాంటిబయాటిక్స్, ప్రయోగశాలలో వాడే రసాయనాలు, రక్త పరీక్షల సొల్యూషన్స్, కిట్ల సరఫరా నిలిచిపోయింది. వాటిని ఆసుపత్రి వర్గాలు బయట కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.



అత్యవసర విభాగంలో వైద్యసేవలు పొందుతున్న రోగులు

దూరం నుంచి వస్తే.. : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన పుష్పమ్మ తన తల్లి యాదమ్మకు జ్వరం వస్తే మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్ష చేశాక వైద్యులు మందులు రాశారు. మందుల కేంద్రం వద్దకు వెళ్తే రెండు రోజులకే జ్వరం మాత్రలు ఇచ్చారు. ఎంతో దూరం నుంచి వస్తే తగినన్ని మందులు కూడా ఇవ్వలేదని వారు తల్లీకూతుళ్లు ఆవేదన వ్యక్తంచేశారు.



తన తల్లికి కొన్నే మందులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్న పుష్పమ్మ



సిరంజీలూ కరవే

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని 30 విభాగాల్లో రోగులకు సిరంజీలతో వైద్యం చేస్తున్నారు. ఇంజక్షన్లు ఇవ్వడానికి, సెలైన్ ఎక్కించడానికి, రక్త పరీక్షలు చేయడానికి, రోగులకు మత్తు మందు ఇవ్వడానికి, రక్త నమూనాలు తీసుకోవడానికి సిరంజీలు, సూదులు అవసరం. ప్రభుత్వం నుంచి మూడు నెలల నుంచి సరఫరా లేదు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిత్యం 2,500 సిరంజీలు అవసరం అవుతున్నాయి. రోజూ 25 సిరంజీ పెట్టెలు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో దానిలో 100 సిరంజీలు ఉంటాయి. బాక్సు ఖరీదు రూ.240. ఇలా రోజు సిరంజీలను కొనుగోలుకే రూ.6వేలు ఖర్చు చేస్తున్నారు. మూడు నెలల నుంచి రూ.5.40లక్షలు సిరంజీలకు వెచ్చించారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు : ప్రభుత్వం నుంచి ఔషధాల సరఫరా నిలిచింది. తగిన స్థాయిలో ఔషధాలు నిల్వ లేకపోవడంతోనే మూడు రోజులకు సరిపోయేలా అందిస్తున్నాం. మా వద్ద లేని మందులు బయట కొనుగోలు చేసి రోగులకు వైద్య సేవలు చేస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ఔషధాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.
- డా.సంపత్‌కుమార్ సింగ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మహబూబ్‌నగర్

జిల్లా అదనపు కలెక్టర్‌గా లక్ష్మీనారాయణ

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: హైదారాబాద్ జీహెచ్ఎంసీ భూ సేకరణ విభాగంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణను జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ కార్యదర్శి నవీన్‌మిట్టల్ ఈ నెల 26న ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు జులైలో ఉద్యోగ విరమణ చేయడంతో జిల్లా భూ సేకరణ అధికారి శ్రీనివాసరావుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలి : సీఐటీయూ

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించేంత వరకు వారికి అండగా సీఐటీయూ పోరాటాలు చేస్తుందని జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి స్పష్టం చేశారు. శనివారం ఐడీవోసీ ఎదుట ఒప్పంద కార్మికుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఒప్పంద, పొరుగు సేవల పేరుతో ఉద్యోగులను నియమించుకుని వెట్టి చాకిరీ చేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహ, నాయకులు గట్టన్న, రాజేష్, లీలావతి, అరుణ, పాల్గొన్నారు.

1న డీఈఎల్ఈడీ, డీపీఎస్ఈ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన


మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: డిప్లొమా ఇన్ ఎలిమెంట్రీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) 2024-26లో ప్రవేశం పొందిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ మేరాజుల్లా ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రవేశం పొందిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని సూచించారు.

అనుమతి లేదంటూ భవనం ధ్వంసానికి చర్యలు

శాంతినగర్, న్యూస్‌టుడే: అనుమతులు సరిగాలేవని శనివారం పుర కమిషనర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల సిబ్బంది పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న ఓ దుకాణ సముదాయం వద్దకు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. అధికారులు స్లాబ్ పగుల కొట్టించడానికి యంత్రాలను తీసుకురావడంతో భవనం యజమానులు, స్థానికులు అడ్డుకున్నారు. అనుమతులకు దరఖాస్తు చేసుకున్నామని ఆ విషయం తేలే వరకు ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని అధికారులను అడ్డుకున్నారు. మూడు అంతస్తుల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి తీసుకుని ఒకదానిలో షాపులు నిర్మించారని, అదనంగా మరో అంతస్తు నిర్మించడంపై 9 నెలల కిందట నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో చర్యలు తీసుకుంటున్నట్లు పుర కమిషనర్ తెలిపారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. అధికారులకు ఇబ్బంది కల్పిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని ఎస్సై సంతోష్ తెలిపారు. అనంతరం అధికారులు రెండు స్లాబ్‌లకు అనుమతి లేదంటూ డ్రిల్లింగ్ మిషన్లతో రంధ్రాలు వేశారు. దుకాణాలకు తాళాలు వేసి సీల్‌వేశారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి కుర్మయ్య, ఆర్ఐ ఆంజనేయులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా పురపాలికలో అనుమతి లేని భవనాలు చాలా ఉన్నా దీనిపైనే చర్యలు తీసుకోవడంపై పురపాలికలో చర్చ నడుస్తోంది. వారం రోజులుగా 10వ వార్డు కౌన్సిలర్‌కు కమిషనర్‌కు మధ్యన నెలకొన్న వివాదం కారణమని చర్చించుకుంటున్నారు. కౌన్సిలర్‌కు భవనం యజమానులు బంధువులు కావడం వల్లనే చర్యలు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



స్లాబ్‌కు దగ్గరుండి రంధ్రాలు వేయిస్తున్న కమిషనర్ లక్ష్మారెడ్డి



కల్తీకల్లు విక్రయిస్తున్న 20 మందిపై కేసు నమోదు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: నిషేధిత మత్తు పదార్థాలతో కల్లు తయారీ చేసి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం రాష్ట్ర నార్కోటిక్ అధికార బృందం గద్వాల పోలీసుల ఆధ్వర్యంలో గద్వాల నియోజకవర్గంలోని పలు దుకాణాలపై ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించిన విషయం విధితమే. కల్లు తాగిన పలువురి నుంచి సేకరించిన నమూనాల ద్వారా జరిపిన పరీక్షలలో పాజిటివ్ అని తేలడంతో కల్తీ కల్లు విక్రయిస్తున్న 20 మందిపై గద్వాల పోలీసులు కేసు నమోదు చేశారు. గద్వాల మండలంలోని జమ్మిచేడు, వీరాపురం, పూడూరు, మేలచెర్వు, మల్దకల్ మండలంలోని మద్దెలబండ, ధరూర్ మండలంలోని మరో రెండు గ్రామాల్లో నార్కోటిక్ అధికారులు నాలుగు బృందాలుగా విడిపోయి దాడులు నిర్వహించి నాలుగు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ విషయమై గద్వాల ఇన్‌ఛార్జి సీఐ నాగేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా గద్వాల పరిసర ప్రాంతాల్లో కల్లు విక్రయిస్తున్న 20 మంది అనుమానితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వేతనాలు చెల్లించాలంటూ నిరసన

ఇటిక్యాల, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న పార్ట్‌టైం సిబ్బంది వేతనాలు చెల్లించకపోవడంతో శనివారం పాఠశాల ముందు మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా చెల్లించక పోవడంతో పాఠశాలలో పనిచేసే పార్ట్ టైం టీచర్లు, సీవోఈ కళాశాలలో పనిచేస్తే సబ్జెక్టు అసోసియేట్స్ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ సంక్షేమ పాఠశాలలో ఎందుకు ఇలా చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రాలు అందజేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్ టైం సిబ్బంది



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు క్రికెటర్లతో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్

పాలమూరు క్రికెట్ జట్టు శుభారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు శుభారంభం చేసింది. శనివారం హన్మకొండ మైదానంలో వరంగల్ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో 34 పరుగుల తేడాతో జిల్లా జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది. షాదాబ్ అహ్మద్ 38, కనిష్క 13, రాంచరణ్ 13, ముఖీత్ 10 పరుగులు చేశారు. అనంతరం వరంగల్ జట్టు లక్ష్య ఛేదనలో చతికిల పడి 29.4 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌట్ అయింది. పాలమూరు జట్టు నుంచి ముఖీత్ 3, షాదాబ్ 2, శశాంక్, అంకిత్, కనిష్క చెరో వికెట్ తీశారు. విజయం సాధించిన జిల్లా జట్టు క్రికెటర్లను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.



ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న యువతులు, మహిళలు

ఒక్కేసి పువ్వేసి సందమామ!

ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మతో నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణికరెడ్డి, విద్యార్థినులు





బతుకమ్మలతో యువతులు


మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ దుస్తులతో ముస్తాబై వచ్చిన విద్యార్థినులు, అధ్యాపకులతో శనివారం మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సందడిగా మారింది. చప్పట్లు కొడుతూ వందలాది గొంతుకలు ఒక్కటై ఆలపించిన బతుకమ్మ పాటలు అందరినీ తన్మయత్వానికి లోనుచేశాయి. కళాశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్యఅతిథులుగా మహబూబ్‌నగర్, నారాయణపేట ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డా.పర్ణికరెడ్డి, రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండగ గొప్పతనాన్ని వివరించారు. ఆధ్యాత్మికత, ప్రకృతి పరిరక్షణే ఈ వేడుక పరమార్థమని అభిప్రాయపడ్డారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కొద్దిసేపు సరదాగా బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మార్కెట్ ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సిరాజ్ ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, శివ, నవీన్, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో యోగా బోధకుల భర్తీకి మౌఖిక పరీక్ష

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆస్పత్రుల్లో యోగా బోధకుల పోస్టుల భర్తీకి ఈ నెల 30న మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని ఆయుష్ ఆయుర్వేద ఆస్పత్రిలో ఉదయం 10.30 గంటలకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయుష్ ఉమ్మడి జిల్లాధికారి డా.ఆదిశేషయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లో 15 మంది పురుషులు, 15 మంది మహిళలు, నాగర్‌కర్నూల్‌లో 19 - పు॥, 19 - మ॥, వనపర్తిలో 9 - పు॥, 9 - మ॥, జోగులాంబ గద్వాలలో 9 - పు॥, 9 - మ॥, నారాయణపేట జిల్లాలో 8 మంది పురుషులు, 8 మంది మహిళలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి లేదా ఇంటర్ విద్యార్హతలు, ఆరు నెలల యోగా శిక్షణ పొందిన ధ్రువపత్రం కలిగి ఉన్న 45 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆధార్, విద్యార్హత, యోగా ధ్రువపత్రాలతో ఆసుపత్రిలో నివేదించాలని సూచించారు.

కంచే చేను మేస్తే..!

- అక్రమ వసూళ్లతో గాడి తప్పుతున్న పోలీసులు
- ఎవరికి చెప్పుకోలేక బాధితుల అవస్థలు




కందనూలు, న్యూస్‌టుడే : ప్రజలకు రక్షణగా నిలిచి ధన, మాన, ప్రాణ, ఆస్తులను కాపాడాల్సిన రక్షక భటులు కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అవినీతికి పాల్పడుతూ వ్యక్తిగత విషయాల్లోనూ తలదూరుస్తూ వివాదాస్పదమవుతున్నారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠ దిగజార్చుతున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించాలంటేనే జంకే పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవలి కొన్ని ఘటనలు ఆ శాఖకు తలవంపులు తెచ్చేలా ఉన్నాయి. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టడమే కాకుండా కేసుల నమోదుకు వెనుకాడటం లేదు.



నాగర్‌కర్నూల్ : బిజినేపల్లి ఠాణాలో వివరాలు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ (పాత చిత్రం)

బెదిరింపులకు పాల్పడి..: మే 15న నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి రోడ్డు పక్కన బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కారులో తన స్నేహితురాలితో కలిసి భోజనం చేస్తుండగా బ్లూకోర్ట్స్ కానిస్టేబుల్ ట్యాబ్‌తో ఫొటో తీశాడు. రూ. 10 వేలు ఇవ్వకపోతే కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేశాడు. గత్యంతరం లేక బాధితుడు రూ. 2 వేలను కానిస్టేబుల్ స్నేహితుని ఖాతాకు అంతర్జాలం ద్వారా చెల్లించాడు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహించే మరో కానిస్టేబుల్ ఇదే తరహా బెదిరింపులకు పాల్పడటమే కాక ఫొటోను కుటుంబ సభ్యులకు చూపడంతో కుటుంబ కలహాలు నెలకొన్నాయి. విషయం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు విచారించి ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు.



బిజినేపల్లి ఠాణాలోని ఓ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసిన బాధితుడు

తాత ఫిర్యాదుతో..: బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన యువకుడు సురేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈనెల 26న గురువారం గ్రామానికి రాగా యువతి తల్లిదండ్రులు యువకుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సురేశ్ డయల్ 100కి సమాచారం ఇచ్చారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ వచ్చి మీకు సహాయం చేస్తానని సురేశ్ నుంచి రూ. 2 వేలు వసూలు చేశాడు. విషయం తెలుసుకున్న సురేశ్ తాత వెంకటయ్య శుక్రవారం ఠాణాలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తున్నారు.

నేరుగా రంగంలోకి ఉన్నతాధికారులు..

బిజినేపల్లి మండల పరిధిలో జూదం జోరుగా కొనసాగుతోంది. వారంలో రెండు సార్లు జూదం కేసులు నమోదవుతున్నాయి. పోలీసు సిబ్బంది అక్రమ వసూళ్లకు అలవాటు పడి దాడులు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోని డీఎస్పీ, సీఐ రహస్య సమాచారం మేరకు నేరుగా రంగంలోకి దిగి దాడులు చేస్తూ జూదరులను అరెస్టు చేస్తుండటం గమనార్హం.

డయల్ 100ను ఆసరాగా అక్రమ వసూళ్లు

రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా సత్వర న్యాయం కోసం డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించడానికి బ్లూకోర్ట్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్తున్నారు. ఇరువర్గాల మధ్య చిన్న ఘర్షణ జరిగినా ఓ వర్గానికి చెందిన వారిని బెదిరించి అక్రమ వసూళ్లు చేస్తున్నారు. అలాగే రాత్రి సమయంలో ఒంటరిగా ఉండే జంటల చిత్రాలను తీసి బెదిరింపులకు పాల్పడి వారి వద్ద అందిన కాడికి దండుకుంటున్నారు. గ్రామ, పట్టణ శివారు ప్రాంతాల్లో మద్యం తాగుతున్నట్లు సమాచారం వచ్చినా డబ్బులు వసూలు చేసి వారిని అక్కడి నుంచి తప్పిస్తున్నారు. ఇదే తరహాలో అక్రమ వసూళ్లకు పాల్పడి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు.

సమాచారం ఇచ్చిన వారే లక్ష్యం


కల్వకుర్తి డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రాత్రి వేళ గుట్టుగా సాగుతుండటంతో గ్రామస్థులు డయల్ 100 ద్వారా సమాచారం ఇస్తున్నారు. సిబ్బంది అక్రమార్కుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తూ ట్రాక్టర్లను విడిచిపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బందిని ప్రశ్నిస్తే గ్రామస్థులపైనే కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

సిబ్బంది క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించబోం. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆరోపణలు వచ్చిన వెంటనే సిబ్బందిపై విచారణ నిర్వహిస్తున్నాం.

- గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ నాగర్‌కర్నూల్

అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ: మంత్రి జూపల్లి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, పక్కన డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, న్యూస్‌టుడే : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకాలు అమలుచేస్తున్నారని, అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ తప్పక చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం పాన్‌గల్ రైతు వేదికలో విండో మహాజనసభ డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని గుర్తుచేశారు. రుణమాఫీకి అర్హులై ఉండి చిన్న చిన్న పొరపాట్లతో కానీ వారికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించి జ్ఞానాన్ని పొందాలని మంత్రి సూచించారు. పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమం అమలుపై విద్యార్థులకు వివరించారు. డీసీసీబీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగిల్ విండోల ద్వారా రైతులకు ఇంకా మెరుగైన సేవలు అందించడానికి కృషిచేస్తామన్నారు. అనంతరం రెడ్డిసేవాసమితి ఆధ్వర్యంలో ఛైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, డీపీవో సురేష్, ఎంఈవో శ్రీనివాసులు, విండో వైస్ ఛైర్మన్ బాలయ్య, సీఈవో భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



శేఖర్

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తిమ్మాజిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్ (45) శనివారం ఉదయం చేపలు తీసుకొస్తానంటూ గ్రామ సమీపంలోని రాళ్ల చెరువుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో కాలుజారి చెరువులో పడిపోయారు. పక్కనే పొలంలో పనులు చేసుకుంటున్న కొందరు గుర్తించి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారమిచ్చారు. అందరూ వెళ్లి చెరువులో శేఖర్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ప్రభుత్వంపై బీసీల్లో అపనమ్మకం'



ధర్నాలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు కావొస్తున్నా బీసీ గణనపై ఊసేలేదని ప్రభుత్వ వైఖరితో బీసీ వర్గాల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయని భారాస నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో బీసీ మహాసభ ధర్నాకు హాజరైన ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావొస్తున్న బీసీ వర్గాలు బడుగులుగానే ఉండటానికి కారకులెవరో చెప్పాలన్నారు. 50 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఉద్యమానికి కల్వకుర్తి నుంచే శ్రీకారం చుట్టామన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత తనదేనని భరోసా కల్పించారు. బీసీలు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

తెరపై ఈనాడు

గద్వాల: ఎస్వీసీ సినిమాస్... దేవర (రెండు స్క్రీన్లు), సత్యం సుందరం, అయిజ: శివసాయి : దేవర, భువనేశ్వర్ : 100 కరోడ్స్, మాధవ్ : సత్యం సుందరం

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

బడుల్లో నిలిచిన పనులు.. చదువులకు కష్టం

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: బడుల్లో మెరుగైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో మన ఊరు, మన బడి పథకం కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెబుతున్నా తీరా ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదు.

మొదట్లో సాగినా..: రామాపురం, జిల్లేడుదిన్నె, కొంకల, తనగల, బుడమర్సు, వెంకట్రామనగర్, జూలేకల్ తదితర చోట్ల ఎక్కడ చూసినా పనులు కావడం లేదు. తనగల, రామాపురంలో గదులు తక్కువగా ఉన్నాయి. మన ఊరు మన బడిలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. మొదట్లో పనులు బాగానే కొనసాగాయి. గదులు లెంటల్ లెవల్, కప్పుస్థాయి వరకు నిర్మించారు. ఆ తర్వాత నిధులు రాకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఫలితంగా విద్యార్థులకు గదుల కష్టాలు తీరడంలేదు.

- రామాపురం, తనగలలో పాఠశాల భవనాలకు ప్రహరీలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ప్రయోగశాల గదుల కోసం ఒక్కోదానికి రూ.15 లక్షల వరకు వచ్చినా పనులు పూర్తికాలేదు. తనగలలో విద్యార్థులు ఆటలాడుకోవడానికి ఆవరణ అధ్వానంగా ఉంది. చుట్టు పక్కల అంతా మురుగు దిబ్బలు, దుర్వాసనతో విద్యార్థులు సమస్యను ఎదుర్కొంటున్నారు. 5 గదులు పాతవి ఉన్నాయి. ఏళ్ల తరబడి పూర్తి కాకుండా 2 అసంపూర్తి గదులున్నాయి.

గుత్తేదారులు రాక: కొంకల జడ్పీ ఉన్నత పాఠశాలలో 40 ఏళ్ల కిందట కట్టిన మొత్తం భవనం పాత బడింది.


తనగలలో పిల్లర్లతో నిలిచిన గదిలోనే తరగతుల నిర్వహణ

అక్కడున్న 6 గదులు పూర్తిగా శిథిలావస్థలో ఉండగా ఇటీవల అమ్మ పథకం కింద రూ.7 లక్షలతో తాత్కాలికంగా అరకొరగా మరమ్మతులు చేశారు. గదుల పైకప్పులు కారకుండా పెచ్చులూడిన ప్రదేశాలను బాగు చేశారు. కొత్త భవనం ఉంటే ఏ సమస్య ఉండదని దాని కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పాఠశాల మన బడి కింద ఎంపిక కాలేదు. ఆరేళ్ల కిందట జిల్లా కలెక్టర్ పాఠశాల గదులు స్థితిని చూసి రూ.66 లక్షల వరకు జనరల్ నిధులు నుంచి మంజూరు చేసినా గుత్తేదారులు ముందుకు రాక నిధులు వెనక్కు వెళ్లాయి.

పరిష్కారానికి చర్యలు: పాఠశాలల్లో పనులు కాక పడుతున్న ఇబ్బందుల గురించి ఉన్నతాధికారులకు వివరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో నర్సింహులు అన్నారు. శిథిలావస్థ గదుల వల్ల కొన్ని చోట్ల పెచ్చులూడి సమస్య అవుతోందని వివరిస్తామన్నారు.

అసంపూర్తిగా తరగతి గదులు

మల్దకల్, న్యూస్‌టుడే: మండలంలోని నాగర్‌దొడ్డి పాఠశాలలో విద్యార్థులకు సరిపడ తరగతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు మన ఊరు- మన బడి కింద పాఠశాలను ఎంపిక చేసి రెండు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.7లక్షలకు పైగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్ వరకు పనులు చేయించి గుత్తేదారు వదిలేశారు. ఏడాదిగా పనులు ఆగడంతో విద్యార్థులు వరండాలోనే చదువులు సాగిస్తున్నారు. గాలి, వానకు ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆగిన పనులను పూర్తి చేయించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో సురేశ్‌ను సంప్రదించగా నిధులు రానందున పనులు ఆగాయి. నిధులు వచ్చేవరకు ఏమి చేయలేని పరిస్థితి ఉందని వివరించారు.


మల్దకల్: నాగర్‌దొడ్డిలో పునాదులకే పరిమితమైన తరగతి గదుల నిర్మాణ పనులు

ఉపాధ్యాయుల కృషితోనే నాణ్యమైన విద్య

మానవపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి శివప్రసాద్ అన్నారు. మండల పరిధి చంద్రశేఖర్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరిశీలించారు.

ఉపకరణాలకు లబ్ధిదారుల ఎంపిక

గట్టు, న్యూస్‌టుడే: దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు శనివారం గట్టు రైతువేదికలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు. మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ, అలింకోవారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి సుమారు 200 మంది దివ్యాంగులు శిబిరానికి తరలి వచ్చారు. 80, అంతకు తక్కువ వికలత్వం ఉన్న వారిని గుర్తించి త్వరలో సహాయ ఉపకరణాలను అందజేస్తామని సంస్థ ప్రతినిధులు వివరించారు. సీడీపీవో నాగరాణి, ప్రత్యేకాధికారిణి ప్రియాంక, తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీవో చిన్నయ్య పాల్గొన్నారు.

పుర కార్మికులకు కిట్లు అందజేత


పుర కార్మికులకు కిట్లు అందజేస్తున్న కమిషనర్, ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ పురపాలికలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు శనివారం పుర కమిషనర్ సరస్వతి, పుర ఛైర్‌పర్సన్ మనోరమ, వైస్ ఛైర్మన్ శేఖర్‌రెడ్డి పీపీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా యంత్రాల వినియోగం, సంక్షేమ పథకాల అనుసంధానంపై శిక్షణ ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికులు ఏటా బీమా రెన్యువల్ చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

'దళితబంధు'లో అక్రమాలపై చర్యలకు వినతి


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి

అయిజ, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ హయాంలో నాయకులు దళితబంధు పేరుతో డబ్బులు దండుకున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి పేర్కొన్నారు. శనివారం అయిజలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన భారాస పార్టీ నాయకులపై విరుచుకుపడ్డారు. దళితబంధు ఇప్పిస్తామని చెప్పి నిరుపేద దళితుల వద్ద రూ.లక్షలు దోచుకుని చివరకు వారికి మొండిచేయి చూపారని విమర్శించారు. కౌన్సిలర్ రాణెమ్మ, నాయకులు మైనర్‌బాబు, దేవేందర్, దేవరాజు, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి


తాటికుంటలో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మల్దకల్, న్యూస్‌టుడే: భూగర్భజలాలను పెంచడానికి, ఇళ్ల మధ్యన మురుగు నీరు పారకుండా ఉండేందుకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పని సరిగా నిర్మించుకోవాలని ఎంపీడీవో ఆంజనేయరెడ్డి సూచించారు. గ్రామాల్లో సామూహిక ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శనివారం తాటికుంట తదితర గ్రామాలను సందర్శించి ఇంకుడు గుంతల నిర్మాణం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఉద్యానవన పంటలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి సవారన్న పాల్గొన్నారు.

'ఉత్తమ విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలం'



స్వర్ణోత్సవ గోడపత్రిక విడుదల చేస్తున్న నాయకులు

శాంతినగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు పేదలకు ఉచిత, నాణ్యమైన కామన్ విద్యను అందించడంలో విఫలమయ్యాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీ పాషా ఆరోపించారు. శాంతినగర్‌లోని బోధిని కళాశాలలో శనివారం సంఘం సమావేశం నిర్వహించారు. దేశంలో పాలకులు పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు విద్యను ప్రైవేట్ పరం చేశారన్నారు. పెట్టుబడిదారులకు విద్యారంగాన్ని కట్టబెట్టడం వల్ల నేడు పూర్తిగా విద్య వ్యాపారంగా మారిందన్నారు. దీనిపైన పీడీఎస్‌యూ పోరాటం చేస్తుందన్నారు. సంఘం స్వర్ణోత్సవ సభ గోడపత్రికలను విడుదల చేశారు. క్రాంతికుమార్, రాజు, మహేష్, భాస్కర్, చంద్రశేఖర్, శివరాజు, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తగ్గించాలని డిమాండ్


నినాదాలు చేస్తున్న జిల్లా తీన్మార్ మల్లన్న సభ్యులు

మల్దకల్, న్యూస్‌టుడే: బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణమే వాటిని తగ్గించి అందులో నిజమైన పేద ఓసీ అభ్యర్థులకు రిజర్వేషన్ వర్తించేలా అమలు చేయాలని తీన్మార్ మల్లన్నటీం జిల్లా అధ్యక్షుడు కొమ్ముల ప్రవీణ్ డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్నపై రెడ్డి జాగృతి సంఘం వారు పెట్టిన కేసుకు నిరసనగా మల్దకల్‌లో దిష్టిబొమ్మను దహనం చేసి, కేసును వెనక్కి తీసుకోవాలని, వెంటనే క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. నాయకులు బండారి సునంద్, నీల్ల నర్సింహులు, తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల సంఖ్య పెంచాలని విన్నపం

అయిజ, న్యూస్‌టుడే: అయిజ పట్టణంలో వార్డుల సంఖ్యను పెంచాలంటూ పుర కమిషనర్ లక్ష్మారెడ్డికి శనివారం భాజపా నాయకులు వినతిపత్రం అందజేశారు. 2012లో నగర పంచాయతీగా ఏర్పడినప్పుడు విభజించిన వార్డులే కొనసాగుతున్నాయన్నారు. ఒక్కో వార్డులో 1,300 నుంచి 1,500 మంది ఓటర్లున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల నాటికి వార్డుల సంఖ్యను పెరిగిన జనాభాకు అనుగుణంగా పెంచాలని వినతిపత్రంలో కోరారు. పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి, నాయకులు ప్రదీప్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, లక్ష్మణాచారి తదితరులున్నారు.

మార్కెట్‌యార్డులో ముళ్లకంప



అయిజలోని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డులో ముళ్లకంప పేరుకుంది. యార్డులో ఉన్న దుకాణాలు శిథిలావస్థకు చేరాయి. ఏడెకరాల మైదానంలో ఎక్కడ చూసినా ముళ్లకంప, పిచ్చిమొక్కలు అలుముకున్నాయి. దీన్ని వినియోగంలోకి తెస్తే రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకోడానికి వీలుగా ఉంటుంది. ప్రస్తుతం కర్నూలు, ఎమ్మిగనూరు, గద్వాల తదితర ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తున్నారు. దీనిపై అలంపూర్ మార్కెట్‌యార్డు ఛైర్మన్ దొడ్డెప్ప స్పందిస్తూ అయిజ యార్డును వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు. -న్యూస్‌టుడే, అయిజ

అసంపూర్తిగా శౌచాలయం



నాగర్‌దొడ్డి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిధుల లేమితో అసంపూర్తిగా శౌచాలయం ఆగింది. ఒంటికి, రెంటికి 212 మంది విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చినా నేటి వరకు ఎలాంటి చర్యలు లేవని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి శౌచాలయాన్ని పూర్తి చేయించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. హెచ్‌ఎం రాఘవేంద్రగుప్తను సంప్రదించగా నిధుల కోసం మరోమారు ప్రతిపాదన పంపుతామన్నారు. -న్యూస్‌టుడే, మల్దకల్

తరగతి గదులు అధ్వానం



అయిదు వందల మందికి పైగా చదువుతున్న రాజోలి ఉన్నత పాఠశాలలో సమస్యలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ప్రహరీ అధ్వానంగా ఉంది. సరైన మరుగుదొడ్లు లేవు. ఇవన్నీ బయటి సమస్యలు. కనీసం విద్యార్థులు విద్యను అభ్యసించే తరగతి గదులు సైతం అధ్వానంగా ఉన్నాయి. రెండు తరగతి గదుల్లో బండలు పగిలిపోవడంతో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, వినే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదించామని, నిధులు రాగానే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో భగీరథ రెడ్డి తెలిపారు. -న్యూస్‌టుడే, రాజోలి

విద్యతో పాటు కళలకు ప్రాధాన్యం


విద్యార్థినుల జానపద నృత్యం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: విద్యతో పాటు సైన్స్ మేళా, సాంస్కృతిక తదితర కళలకు ప్రాధాన్యత నివ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు పేర్కొన్నారు. గద్వాలలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన యువజనోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జానపదాలు, నృత్యాలు, జానపద గేయాలు, కథా రచన, కవిత్వం, సైన్స్ డ్రామా, హస్త కళ, వస్త్రకళ తదితర పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ కలందర్ బాష, ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు, జిల్లా యువజన సర్వీస్ అధికారి ఆనంద్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల బహిష్కరణకు నిరాహార దీక్ష


మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: నిషేధిత మత్తు పదార్థాల నివారణకు, ప్రజా అవగాహనకు గద్వాలలో ఈ నెల 30న నిరాహార దీక్ష చేయనున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం గద్వాలలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాలో అక్రమంగా గంజాయి వాడుతున్నారనే వార్తల నేపథ్యంలో, నిషేధిత అల్ప్రాజోలం, డైజోఫాం, సీహెచ్ లాంటి వాడకం పెరుగుతున్న నేపథ్యంలో యువత వీటికి బానిసలయితే కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయని ఆరోపించారు. మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దనే ఉద్దేశంతో పాటు వీటి వాడకం వల్ల కలిగే నష్టాలను ప్రజా అవగాహనకు ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ సర్కిల్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

పొలాలున్నా.. పంట వేయలేం..!

లోకాయుక్త సభ్యులకు మొర పెట్టుకున్న రైతులు

కొత్తకోట, వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: భీమా ప్రాజెక్టు 2వ దశలో ముంపునకు గురైన వ్యవసాయ పొలాలను శనివారం లోకాయుక్త అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో సభ్యులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కొత్తకోట మండలం రాయనిపేట, వనపర్తి మండలం కడుకుంట్లకు చెందిన రైతులు భీమా ప్రాజెక్టు 15వ ప్యాకేజీలో చెరువులు నింపుతున్న క్రమంలో తమ పొలాలు ఒక పంట హక్కును కోల్పోయామంటూ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. రాయనిపేటకు చెందిన 196 ఎకరాలు, కడుకుంట్లకు చెందిన సుమారు 300 ఎకరాలు చెరువులను నింపడం(ఎఫ్‌టీఎల్) వల్ల ముంపునకు గురవుతున్నట్లు ఫిర్యాదు చేశారు. భూ యాజమాన్య హక్కులు(పట్టాలు) కలిగిన తాము ఒక్క పంటను కూడా వేయలేకపోతున్నందున పరిహారం ఇవ్వాలంటూ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా స్పందనలేకపోవడంతో బాధితులు 2019లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో లోకాయుక్తలో ఇన్విస్టేగేషన్ టీం ఈ పర్యటనలో పాల్గొని బాధిత రైతుల ఇబ్బందులను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకుంది. సంబంధిత చెరువులు, ముంపునకు గురైన పొలాలను పరిశీలించింది. రైతుల తరఫున న్యాయవాది శంకర్ రెడ్డి అధికారులకు స్థానిక పరిస్థితులు వివరించారు. ఏడాది పొడవునా చెరువుల్లో నీరు ఉండటం వల్ల ఒక్క ఎకరాన్ని సాగు చేసుకోలేకపోతున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా నష్టపోయిన రైతులకు సింగోటం, కోడేరు, పెద్ద కొత్తపల్లి ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.6 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారని గుర్తు చేస్తూ వీరంతా పరిహారం కోసం పూర్తి అర్హత కలిగి ఉన్నట్లు తెలిపారు. స్థానిక పరిస్థితులకు క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు నివేదికను సిద్ధం చేసి లోకాయుక్త ముందుంచుతామని తెలిపారు. లోకాయుక్త సభ్యుడు తిరుపతి వెంకట్రావ్, భీమా ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో పద్మావతి, కొత్తకోట, వనపర్తి తహసీల్దార్లు, వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, ఎస్సైలు మంజునాథ్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.


రాయనిపేట చెరువు వద్ద పరిశీలనలో లోకాయుక్త సభ్యుల బృందం

నాగర్‌దొడ్డి విద్యార్థుల విరాళం

మల్దకల్, న్యూస్‌టుడే: వరద బాధితులను తమవంతుగా మానవత్వంతో మల్దకల్ మండలం నాగర్‌దొడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ముందుకు వచ్చారు. శనివారం విరాళాలు సేకరించి 'ఈనాడు' సహాయ నిధికి అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్రగుప్త తెలిపారు.

బాలసభలో ప్రతిభ

ధరూర్, న్యూస్‌టుడే : ధరూర్ మండల పరిధిలోని ఉప్పేర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం బాలసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా ఈ బాలసభలో ఒకటి నుంచి 20ఎక్కాలు అనర్గళంగా చెప్పే విద్యార్థులు, తెలుగు పద్యాలను రాగయుక్తంగా పాడే విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.

పెద్దల కృషిని గౌరవించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దలు సమాజానికి చేసిన కృషిని గౌరవించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా గద్వాలలోని ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా, శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం- 2007పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి సునంద వయోవృద్ధుల పోషణ, సంక్షేమంపై ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీవో రామ్‌చందర్, ఎస్సై శ్రీనివాసరావు, న్యాయవాది వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఏర్పాటుకు మంత్రికి ఎమ్మెల్యే వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవల్లి, న్యూస్‌టుడే: అలంపూర్‌చౌరస్తాలో ఆర్టీసీ డిపో ఏర్పాటుతో పాటు బస్సులకు కావాల్సిన డీజిల్ బంకును ఏర్పాటు చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే విజయుడు శనివారం హైదరాబాదులో వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థులు సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే మంత్రికి విన్నవించినట్లు పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

దాడులు ఆపండి

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ఆటోడ్రైవర్ల మీద పోలీసులు, అధికారుల దాడులు ఆపాలని కోరుతూ వడ్డేపల్లి తహసీల్దార్ ప్రభాకర్, సీఐ టాటాబాబుకు శనివారం ఆటో డ్రైవర్లు వినతి పత్రం అందించారు. నిత్యం విద్యార్థులను తరలిస్తూ పాఠశాలలకు, ఇళ్లకు సకాలంలో చేరుస్తున్నామని, ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పుతున్నారని వారు వివరించారు.


సీఐకి వినతిపత్రం అందిస్తున్న ఆటో డ్రైవర్లు

గెలుపు కన్నా.. ప్రయత్నం ముఖ్యం


విద్యార్థినుల థింసా నృత్యం


క్రీడాకారులతో అధికారులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: గెలుపు కన్నా ప్రయత్నం ముఖ్యమని ఇటిక్యాల, ఎర్రవల్లి మండల విద్యాధికారులు అమీర్ భాషా, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ ఎస్‌జీఎఫ్ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో అండర్-14, అండర్-17 బాలుర వాలీ బాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14 విభాగంలో కేటి దొడ్డి మండల విద్యార్థులు ప్రథమ స్థానం, మల్దకల్ మండల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. అండర్-17 విభాగంలో అయిజ ప్రథమ, ఇటిక్యాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలను జోనల్ స్థాయికి ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ కన్వీనర్ గౌరి తెలిపారు. విశ్రాంత విద్యాధికారి రాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ మాట్లాడారు. ఎంపీడీవో అజర్ మొయినుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య, కార్యదర్శి భరత్‌కుమార్, తిరుపతి, నర్సింహరాజు, శ్రీనివాసులు, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యతలేని మధ్యాహ్న భోజనంతో ఇబ్బందులు'

గట్టు, న్యూస్‌టుడే: బోయలగూడెం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహారం రుచిగా లేకపోవటంతో పలువురు విద్యార్థులు రోజూ తినటం లేదన్నారు. అధికారులు స్పందించి మంచి భోజనం అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తుంగభద్రలో స్వల్పంగా పెరిగిన ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే : తుంగభద్ర నదిలో 6,850 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. శనివారం నదిలో స్వల్పంగా ప్రవాహం పెరిగింది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 8.8 అడుగుల ఎత్తులో ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా అది రాష్ట్రానికి వచ్చే సరికి 5 అడుగులుగా ఉంది. ● సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. శనివారం ఎగువ నుంచి 4,700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో డ్యాంలోని ఒక గేటు ద్వారా దిగువకు 2,300 క్యూసెక్కులు, కేసీ కాలువకు 2,400 క్యూసెక్కులను వదులుతున్నామని డ్యాం అధికారులు తెలిపారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: వీరాపురం టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల/కళాశాలలో పనిచేస్తున్న పార్ట్ టైమ్ సిబ్బంది నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గేట్ ధర్నా నిర్వహించారు. ధరూర్ మండలం గుడెందొడ్డి టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల/కళాశాల భవనం పార్ట్ టైమ్ సిబ్బంది వేతనాలు చెల్లించాలని కోరుతూ మధ్యాహ్నం ధర్నా నిర్వహించారు. సిబ్బంది జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, నాగరాజు, మసూద్, వెంకటేశ్, ఆనందం, దేవప్ప, మునిస్వామి, రాజు, రేవతి, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ కార్యాలయానికి తాళం

మానవపాడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయానికి తాళం వేసి ఓ రైతు నిరసన తెలిపారు. స్థానిక కార్యాలయం ప్రాంగణంలో సొసైటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సమావేశం జరుగుతుండగా తనకు న్యాయం చేయాలంటూ రైతు సాయిబాబా కార్యాలయానికి తాళం వేశాడు. చంద్రకాంత్‌రెడ్డి అప్పు చెల్లించలేదని సొసైటీ వేలం వేస్తున్న పొలాన్ని సాయిబాబా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ పొలంలో పంటలు సాగు చేయగా.. చంద్రకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు తొలగించారు. తనకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులు, సొసైటీ ఉద్యోగులకు పలుమార్లు చెప్పిన కూడా స్పందన లేకపోవడంతో కార్యాలయానికి తాళం వేసినట్లు సాయిబాబా తెలిపారు. తాను వేలం పాటలో దక్కించుకున్న పొలం అయినా ఇప్పించండి లేదా డబ్బులైనా ఇప్పించాలని సొసైటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డిని కోరారు. స్పందించిన ఛైర్మన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


తాళం వేసి నిరసన తెలుపుతున్న బాధిత రైతు సాయిబాబా